క్లుప్తంగా

పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి

మాడ్గుల: మండల పరిధిలోని కలకొండ గ్రామంలో బుధవారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి అరుణ కుమారి గురువారం పరిశీలించారు. వివరాలను సేకరించారు. 31 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. పంట నష్టం వివరాలను సేకరించి, ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ) ఉన్నారు.

యువతి వివాహానికి ఆర్థికసాయం

ఆమనగల్లు: కడ్తాల్ మండలం సాలార్‌పూర్ గ్రామానికి చెందిన నేనావత్ అనిత, చందర్ దంపతుల కుమార్తె స్వాతి వివాహానికి కడ్తాల్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దశరథ్‌నాయక్ రూ.21 వేల నగదు, పట్టుచీర అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఎంపీపీ పంతునాయక్, మాజీ ఎంపీటీసీ రమేశ్, నాయకులు రామకృష్ణ, లాయక్ అలీ, జైపాల్, గోపాల్, శ్రీకాంత్, అంజి, మల్లేశ్, రాజు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: మండల పరిధి బండలేమూర్ గ్రామం సపావట్ విజయ- శంకర్ దంపతుల కూమార్తె వివాహానికి మాజీ సర్పంచ్ పాతులోత్ మంగ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆడబిడ్డ పెళ్లి అంటేనే డబ్బుతో కూడుకున్న వ్యవహారమన్నారు. మానవతా దృక్పథంతో సహకారం అందించాలని సూచించారు. మాజీ ఉప సర్పంచ్ కిషన్ నాయక్ ఉన్నారు.



మాడ్గుల: నాగిళ్లలో సీఐటీయూ నాయకులు



యాచారం: నక్కర్తమేడిపల్లిలో.. సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ తదితరులు

ఐక్యతకు నిదర్శనం మేడే

'పోరాడి తెచ్చుకున్న కార్మిక హక్కులను కేంద్రం కాలరాస్తోంది. కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తోంది. శ్రామికులకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధివిధానాలను తిప్పికొట్టాలి' అని సీపీఎం, సీఐటీయూ నాయకులు అన్నారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు ప్రాంతాల్లో ఎర్రజెండాలను ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. శ్రామికుల హక్కుల కోసం ఐక్య పోరాటం చేయడమే మే డే లక్ష్యమన్నారు. హక్కులు, చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, సీపీఎం నేతలు



మంచాలలో.. సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య తదితరులు



ఆమనగల్లులో.. సీపీఎం ఏరియా కన్వీనర్ శివశంకర్ తదితరులు



యాచారంలో.. సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య తదితరులు



ఆమనగల్లు: కడ్తాల్‌లో..



తుర్కయంజాల్‌లో.. సీపీఎం, సీఐటీయూ నాయకులు, కార్మికులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. నగరంలోని తన నివాసంలో గురువారం నియోజకవర్గ పరిధిలోని పలువురికి మంజూరైన రూ.7.9 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అబివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్‌రెడ్డి, జగన్‌గౌడ్ పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు పట్టణం నవచైతన్య కాలనీకి చెందిన దేవమ్మకు ఎమ్మెల్యే కసిరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.32 వేల చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు గురువారం పట్టణంలో లబ్ధిదారుకు కాంగ్రెస్ నాయకుడు బాబా చెక్కు అందజేశారు. నాయకులు విజయ్‌రాథోడ్, సురేశ్, కొండల్‌రెడ్డి, మహేశ్, శ్రీశైలం, రాజు, సయ్యద్, నరేశ్ పాల్గొన్నారు.

రాహుల్ ఒత్తిడితోనే కులగణన

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా

ఆమనగల్లు: దేశంలో జనగణనతో పాటు కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని, ఇది రాహుల్‌గాంధీ ఒత్తిడితోనే సాధ్యమైందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. సర్వే పూర్తి చేయడానికి నిర్ణీత కాల వ్యవధిని ప్రకటించాలని సూచించారు. కడ్తాల్ మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ.. కులగణన చేపట్టి ఏ సామాజిక వర్గం ఎంత ఉందో, అందుకు అనుగుణంగా విద్య, ఉద్యోగ, ఉపాధి, స్థానిక ఎన్నికలు, బడ్జెట్‌లో తగిన వాటా ఇవ్వాలని రాహుల్ కోరుతున్నారని పేర్కొన్నారు. రాహుల్ నిర్వహించిన జోడోయాత్రలో దేశ ప్రజల సమస్యలు విన్నారని, ఈ సందర్భంగా పార్టీ అధికారంలోకి రాగానే కులగణన చేపట్టి అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. అనుకున్నట్లుగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వే చేశామన్నారు. అనంతరం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తీర్మానం చేసి, కేంద్రానికి పంపించిన ఘనత రాహుల్‌దేనని వంశీ స్పష్టంచేశారు. కేంద్రంలో అధికారంలోకి రాకున్నా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై రాహుల్ కులగణన కోసం ఒత్తిడి తెచ్చారని చెప్పారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ కడ్తాల్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, ఆమనగల్లు మండల అధ్యక్షుడు జగన్ ఉన్నారు.



కడ్తాల్‌లో రాహుల్, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న వంశీచంద్‌రెడ్డి

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ 2025- 26 సంవత్సరానికి క్లబ్ 40వ అధ్యక్షుడిగా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన కె.గోవర్ధన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. గురువారం పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో లయన్ మాజీ గవర్నర్లు చెన్న కిషన్‌రెడ్డి, రమేశ్‌బాబు, నరేందర్‌రెడ్డి, క్లబ్ ఐ హాస్పిటల్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ భిక్షపతి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని నియమించారు. అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శిగా గంప శ్రీను, కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌ఓగా పాషా, ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా వెంకటయ్య, టేమర్‌గా వెంకటేశ్, టేల్ ట్విస్టర్‌గా మోహన్‌రెడ్డి, డైరెక్టర్లుగా సునంద, చంద్రశేఖర్, వెంకటేశ్, రాంచంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రమేశ్, మనోహర్, ఓంకారం, రాంరెడ్డిలను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ ద్వారా సేవలను విస్తృతం చేస్తామని చెప్పారు.

చరిత్రాత్మక నిర్ణయం

ఆమనగల్లు: దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టడానికి మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆయన మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దేశ ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారని పేర్కొన్నారు. జనగణన, కులగణన ద్వారా వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు వీలవుతుందని వివరించారు.

నేడు 'రాజీవ్' పథకంపై సమీక్ష

మంచాల: రాజీవ్ యువ వికాసం పథకం అమలు తీరుపై శుక్రవారం మంచాల మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీఓ బాల శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సమీక్ష జరగనుందని పేర్కొన్నారు. సమావేశానికి ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, బ్యాంకు మేనేజర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.